క్లుప్తంగా

బొత్సను కలిసిన డాక్టర్ శ్రీకాంత్



వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసిన డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణను నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బొత్స సత్యనారాయణ నివాసంలో కలసి నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్‌గా ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. నియోజకకవర్గంలో పార్టీ పటిష్టత గురించి బొత్స, తాను కొద్దిసేపు చర్చించుకున్నామని డాక్టర్ శ్రీకాంత్ ఫోన్‌లో తెలిపారు.

వెంకన్నకు 1,116 మామిడి పండ్లతో అభిషేకం



స్వామి వారిని మామిడి పండ్లతో అభిషేకిస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. పట్టణానికి చెందిన కిరాణా హోల్ సేల్ వ్యాపారి, దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు రేపాక సత్యనారాయణమూర్తి 1,116 మామిడి పండ్లతో అభిషేకం చేయించారు. ఉదయమే స్వామికి పంచామృతాభిషేకాలు, సుదర్శ హోమం కన్నుల పండువగా జరిగాయి. అనంతరం స్వామికి మామిడి పండ్లతో అర్చకులు అభిషేకం చేశారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు, పెద్దింటి సత్యనారాయణాచార్యులు, పెద్దింటి సూర్యనారాయణాచార్యులు స్వామికి మామిడి పండ్లతో అభిషేకం చేశారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న దస్తావేజు లేఖరి రాము, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: మండలం పాలగుమ్మి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతిలో 500కు పైగా మార్కులు వచ్చిన విద్యార్థులను శనివారం సత్కరించారు. కె.మోహిత లక్ష్మీ సౌమ్య (561), కె.జయేంద్ర (557), డి.రీనా అలేఖ్య (552), ఎం.లావణ్య సౌమ్య (546), సీహెచ్ లిఖిత (545), ఎం.నవ్య శ్రీ (541), బి.విమల దుర్గ (541), సీహెచ్ లోకేష్ (533), వి.వాసుకి (518), జి.వైశాలి (515), కె.వాణి లక్ష్మీ షణ్ముఖ ప్రియ (511) లను అమలాపురానికి చెందిన దస్తావేజులేఖరి మట్టపర్తి రాము, ఆయన కుమార్తె మట్టపర్తి లక్ష్మీ కార్తిక సౌందర్యలు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు స్వీట్ బాక్సులు, డిక్షనరీ, చేతి గడియాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుంట్రు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయిరాం మృతి తీరని లోటు



సభలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాజు

అమలాపురం రూరల్: జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి, రావులపాలెం మండలం గోపాలపురం పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల సాయిరాం మృతి బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని జిల్లా పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలిపారు. శనివారం కామనగరువులో డీపీవో కార్యాలయం వద్ద సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఎస్ సూరపరాజు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జి రాజు, కాకినాడ డీపీవో కార్యాలయం ఏవో నిమ్మకాయల సుబ్బారావు, ఈవో పీఆర్‌డీ శ్రీరామ్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు

కాట్రేనికోన: మండలం పెనుమల్లిలో అంబేడ్కర్ యూత్ సభ్యులు శనివారం అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలాటి సత్యవతి, నల్లా నరసింహమూర్తి, చెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలకు బంకు

- పెట్రోలు బంకుల్లో కనిపించని సదుపాయాలు
- ఇక్కట్లకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



అనాతవరంలో అలంకారప్రాయంగా ఉన్న సౌకర్యాలతో వినియోగదారులకు ఎటువంటి ఉపయోగం లేని పెట్రోలు బంకు

ఉప్పలగుప్తం: ఒకప్పుడు సొంత వాహనాల ప్రభావం తక్కువగా ఉండడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణికులు బస్సు, ఆటోలపై వెళ్లేవారు. ఈ మధ్య కాలంలో కొన్నేళ్లుగా ఏ తరహా వారైనా కారు, మోటారుసైకిల్ వంటి సొంత వాహనాలను వినియోగించడం పరిపాటిగా మారింది. వాటిపైనే సుదూర ప్రాంతాలకు వెళ్లడం, వ్యాపారాలు సాగించడం పరిపాటైంది. వీటి రవాణాలతో ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు పెరుగుతున్నప్పటికీ, పెట్రోలు వినియోగదారులకు వసతులు కల్పించడంలో ఆయా యాజమాన్యాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. నిర్వాహకులు బంకు ప్రారంభించినప్పుడే ప్రభుత్వం దానికి అనుమతులు ఇవ్వడానికి ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలను అందుబాటులో ఉంచితేనే అనుమతులు అందిస్తారు. అనుమతులు తెచ్చుకునేందుకు కొంత మంది బంకు యజమానులు వాటిని అలంకారప్రాయంగా చూపించి తరువాత మరుగున పడేస్తున్నారు. ఇందేమిటని ప్రశ్నిస్తే వాహన చోదకులను బెదిరించి వారితో వాగ్వాదానికి దిగడం మామూలైపోయిందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో..

ద్విచక్ర , నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారి సంఖ్య బాగా పెరిగింది. కుటుంబానికి రెండు ద్విచక్ర వాహనాలు, గ్రామానికి దాదాపు 40 నుంచి 80 వరకు పెద్ద వాహనాలు ఉన్నాయి. పెరిగిన వాహనాల సంఖ్యకు తగ్గట్టుగా పట్టణాల్లో, గ్రామాల్లో పెట్రోలు బంకులు వెలిశాయి. కొన్ని బంకుల్లో వాహనచోదకులకు తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయడం లేదు. వాహనాలకు ఉచితంగా గాలి పెట్టాలనే నిబంధనను గాలికొదిలేశారు. వాహనచోదకులు మరుగుదొడ్లు ఉన్నాయా అని అడిగితే బంకుల నిర్వాహకులు సరైన సమాధానం ఇవ్వడం లేదు. రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు చేసే వారికి బంకుల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో రాత్రి వేళల్లో కార్లు, లారీల్లో ప్రయాణాలు చేసే వారు చేసేదేమీ లేక ప్రయాణాలు కొనసాగిస్తూ నిద్రమత్తులో ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంత మంది అయితే రహదారుల పక్కనే నిలిపి విశ్రాంతి తీసుకుంటున్నారు.

నిబంధనలు ఇలా..

ప్రతి పెట్రోలు బంకులో వాహనచోదకుల సౌకర్యార్థం ఫిల్టర్‌తో కూడిన తాగునీటి సదుపాయం , పరిశుభ్రమైన మరుగుదొడ్ల ఏర్పాటు, వాహనాలకు ఉచితంగా గాలి పెట్టడం, కాలుష్యం పెరగకుండా బంకు పరిసర ప్రాంతంలో చెట్లను పెంచడం, ఫైర్ కంట్రోల్ చేసేందుకు పరికరాలు, రాత్రి వేళల్లో ప్రయాణాలు చేసే వారు విశ్రాంతి తీసుకొనేందుకు, పెట్రోల్ ఫిల్టర్ పేపర్, 5 లీటర్ల చెక్కింగ్ క్యాను ఉండి వినియోగదారుడు కొలత అడిగితే చూపించాలి. వాహనాల నిలుపుదలకు హమ్మింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఉన్న పెట్రోలు బంకుల్లో ఈ తరహా సౌకర్యాలు మచ్చుకైన కనిపించడంలేదు. కొన్ని బంకుల్లో గాలి పట్టే మెషీన్లు అందుబాటులో ఉన్నప్పటికీ ద్విచక్ర వాహనానికి పది రూపాయలు, పెద్ద వాహనాలకు 50 రూపాయలు చొప్పున బంకు నిర్వాహకులు వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. కనీస సౌకర్యాల కల్పన గురించి ఎవరైనా వాహన యాజమానులు ప్రశ్నిస్తే బంకుల్లోని సిబ్బంది వారితో వాదనకు దిగుతున్నారు. బంకుల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు గురించి ఏ శాఖ అధికారులకు ఎలా ఫిర్యాదు చేయాలో తెలియక వాహనచోదకులు తలలు బాదుకుంటున్నారు. పౌరసరఫరాల, రెవెన్యూ అధికారులు స్పందించి పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

లోపించిన నాణ్యత

అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం రూరల్, టౌన్, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం నియోజవర్గంలో ముమ్మిడివరం , కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో 27 బంకుల వరకు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారుగా నిత్యం 30 వేలకు పైబడి వివిధ రకాల వాహనాలు బంకులకు పెట్రోల్, డీజీల్ నిమిత్తం వెళుతూ ఉంటాయి. కొన్ని పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజీల్ సరిగ్గా కొట్టడం లేదని, నాణ్యత లోపిస్తుందని ఆరోపణలు వస్తున్నా ఏ అధికారి పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు లేకుంటే చర్యలు



పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల సౌకర్యార్థం కనీస సౌకర్యాలు కల్పించాలి. నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులో వాహనాలకు ఉచితంగా గాలి పెట్టేందుకు మిషన్, మరుగుదొడ్లు, తాగునీరు, పార్కింగ్ సౌకర్యం కల్పించాలి. సౌకర్యాలు కల్పించకుండా వాహన చోదకులను ఇబ్బందులకు గురి చేస్తే యాజమన్యాలకు నోటీసులు జారీ చేస్తాం . అప్పటికీ స్పందించకపోతే తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎ.ఉదయ్‌భాస్కర్, జిల్లా పౌర సరఫరాల అధికారి

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి



పేరూరు శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు పిలుపునిచ్చారు. మండలం పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిబిరం శనివారంతో ముగిసింది. పాఠశాల హెచ్‌ఎం కేఏఆర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఎంవో మాట్లాడుతూ విద్యార్థులు పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్స్, గేమింగ్ ప్రోగ్రామ్, రోబోటిక్ టెక్నాలజీపై విద్యార్థులకు మూడు రోజుల పాటు పేరూరు అటల్ హబ్ పాఠశాలతో పాటు, పుల్లేటికుర్రు, అంబాజీపేట, గొల్లవిల్లి, జి.వేమవరం, అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్పోక్స్ స్కూల్స్ విద్యార్థులకు ఈ శిబిరం నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలోని 45 అటల్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఒకరోజు వర్క్ షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోబోటిక్ పోటీల్లో గొల్లవిల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పార్టిసిపేటింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు పి.నరేష్, స్వాతిప్రియ, ఉపాధ్యాయులు బీవీ గౌరీప్రసాద్, అటల్ హబ్ పాఠశాల నోడల్ ఇన్‌చార్జిలు కె.పద్మావతి, కె.పావని, ఎం.సీతామహాలక్ష్మి, ఎ.రామకృష్ణ, యూవీ రావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో 45 జట్లు

- 12 రోజుల పాటు సాగనున్న పోటీలు
- ఉత్సాహంగా ప్రారంభమైన ఎస్‌పీఎల్–2



సావరం ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: పట్టణం సావరం ప్రీమియర్ లీగ్ ఎస్‌పీఎల్ –2 క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. ఈదరపల్లి–నల్లవంతెన మధ్య గల బైపాస్ రోడ్డు చెంత ఖాళీ స్థలంలో పోటీలు మొదలయ్యాయి. ఈ టోర్నీని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. సావరం యూత్ ఆధ్వర్యంలో గత ఏడాది మొదటి సారిగా ఎస్‌పీఎల్ –1 పేరుతో క్రికెట్ టోర్నీ ప్రారంభించింది. ఆ పోటీలు విజయవంతం కావడంతో సీజన్–2 మొదలుపెట్టింది. 12 రోజుల పాటు సాగనున్న టోర్నీలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆహ్వానించిన 45 జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయని నిర్వాహక ప్రతినిధి చిత్రపు అజయ్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, పెనుమాల చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, అమలాపురం రూరల్ మండల పార్టీ యూత్ ప్రెసిడెంట్ కేతా భాను తేజ, పార్టీ నాయకులు చెల్లుబోయిన నాని, గోపి రమేష్ నక్కా సంపత్‌కుమార్, దొంగ చిన్నా, ముషిణి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

- సభ్యుల ప్రశ్నలపై కమిషనర్‌కు చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఆదేశం
- వివిధ అంశాలపై కౌన్సిల్ సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో శనివారం ఆయన అధ్యక్షతన కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం జరిగింది. అజెండాలోని అంశాలపై చర్చిస్తుండగా ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, అడబాల సతీష్‌కుమార్ మాట్లాడుతూ పలు వార్డులలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ కొన్ని వార్డులలో పైప్‌లైన్లు లీకై తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, మరమ్మతుల నేపథ్యంలో రెండు మూడు రోజులు ఈ పరిస్థితి ఉంటుందని వివరించారు. అలాగే వేసవి దృష్ట్యా ఆయా వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ రవివర్మకు ఆయన సూచించారు. అలాగే అనధికార లే అవుట్లు, వాటి నిర్వహణకు పంట బోదెలను కప్పివేయడం, జాతీయ రహదారిపై వీధిలైట్లు లేకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాలపై సభ్యులు వివరించారు. కాగా ఉగ్రదాడి ఘటనలో మృతుల కుటుంబాలకు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

స్టాండింగ్ కౌన్సిల్ నియామకంపై భిన్న వాదనలు

నగర పంచాయతీలో స్టాండింగ్ కౌన్సిల్ నియామకంపై అజెండాలోని రెండో అంశంలో బార్ అసోసియేషన్‌కు చెందిన నలుగురు న్యాయవాదుల పేర్లు సూచిస్తూ ఒకరి పేరును కౌన్సిల్ తీర్మానానికి ప్రవేశపెట్టారు. అయితే అందులో ఉన్న న్యాయవాది కోన వెంకట శ్రీనివాసరావు పేరును 17వార్డు వైఎస్సార్ సీసీ కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ ప్రతిపాదించగా వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు బలపర్చారు. అయితే ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సిఫారసు చేసిన దాసరి సత్యనారాయణ పేరును ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ బలపర్చారు. దీంతో ఇరువురి నియామకంపై సభ్యుల బలబలాలను పరీక్షించాల్సి వచ్చింది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు చైర్మన్ ప్రవీణ్‌తో సహ 11 మంది శ్రీనివాసరావు పేరును బలపర్చారు. అలాగే టీడీపీకి చెందిన ఆరుగురు సభ్యులు ఎమ్మెల్యే సిఫారసు చేసిన సత్యనారాయణ పేరును బలపర్చారు. దీనిపై కమిషనర్ రవివర్మ స్పందిస్తూ ఎమ్మెల్యే సిఫార్సు ఉన్నందున కౌన్సిల్ సభ్యులు అభిప్రాయాలను ఎమ్మెల్యే సుబ్బరాజు దృష్టికి తీసుకు వెళ్లి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

అల్లవరం: ఉపాధి కూలీలకు వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కోడూరుపాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమ్మర్ అలవెన్సు పునరుద్ధరించాలని, అడిగిన వారందరికి పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు శివ, విజయలక్ష్మి, లక్ష్మీకాంతం, పొలమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓడలరేవు గ్రామస్తుల డిమాండ్లు పరిష్కరించాలి

ఓడలరేవు గ్రామ అభివృద్ధి, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ 55 రోజులుగా నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌జీసీ సంస్థ గ్రామాన్ని అభివృద్ధి చేయకపోవడం చాలా బాధకరమని తెలిపారు. కార్యక్రమంలో నాతి లెనిన్‌బాబు, కొప్పాడి రామకృష్ణ, పొనమండ ఏసుబాబు, కొల్లాడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతకు సన్మానం



రక్తదాత రామకృష్ణను సన్మానిస్తున్న సర్పంచ్ చిరంజీవిరావు, గ్రామస్తులు

అల్లవరం: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు రక్తాన్ని అందిస్తున్న ములపర్తి రామకృష్ణను గూడాల సచివాలయంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. 40 సార్లు పలువురు రోగులకు రక్తం దానం చేసిన రామకృష్ణను సత్కరించి అనంతరం దాకారపు మాట్లాడుతూ నేటితరానికి ఆదర్శప్రాయుడన్నారు. సన్మాన గ్రహీత రామకృష్ణ మాట్లాడుతూ మదర్‌థెరిస్సా సేవా సంస్థను ఏర్పాటుచేసి 2013 నుంచి రక్తదానం అలవాటుగా మార్చుకున్నానని తెలిపారు. డ్రైవర్‌గా పని చేసుకుంటూ,పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో రాకుర్తి జయరామకృష్ణ, బొలిశెట్టి వెంకటేశ్వరరావు, నూకల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ శాంతి ర్యాలీ

అమలాపురం టౌన్: ఉగ్రదాడులకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కొవ్వొత్తుల శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పర్యవేక్షణలో నిర్వహించనున్న ఈ ర్యాలీ స్థానిక హైస్కూలు సెంటరు నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ సాగుతుందని చెప్పారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అభిమానులు ఈ శాంతి ర్యాలీకి హాజరై దేశానికి సంఘీభావం తెలపాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

ఉగ్రదాడి మృతులకు శ్రద్ధాంజలి



తాళ్లరేవు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న తాళ్లరేవు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

తాళ్లరేవు: ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ తాళ్లరేవు వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. తాళ్లరేవు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి దీపారాధన విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వర శర్మ (కాశిబాబు), ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు, కందికొండ భాస్కరశర్మ, మర్ల ఫణిశర్మ, పెద్దింటి శ్రావణ్‌కుమార్, ఈమన పురుషోత్తం , కొండవీటి శ్రీరాం, శివ, బాబీ, హరి పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం టౌన్: ఉగ్రదాడులకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ శాఖ ఆధ్వర్యంలో వైద్యులు శనివారం రాత్రి స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ కోనసీమ శాఖ వైద్య నిపుణులు జంధ్యాల శివకుమార్, వైటీ నాయుడు, కదలి ప్రసాద్ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు.

దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

తాళ్లరేవు: ఉగ్రదాడికి నిరసనగా తాళ్లరేవులో శనివారం రాత్రి శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అనంతరం ఆ దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు కన్నిడి వెంకట రమణ, కార్యదర్శి కుసుమ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రొక్కం లోవరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు కమిడి ఈశ్వరీబాయి పాల్గొన్నారు.

కార్టూన్‌తో నివాళి



రాము గీసిన కార్టూన్

అమలాపురం రూరల్: మండలం బండారులంకకి చెందిన చిత్రకారుడు మాడా రాము ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి తన చిత్రం ద్వారా నివాళులర్పించారు. ఆయన గీసిన కార్టూన్ పలువురిని ఆకట్టుకుంటోంది.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో..

అమలాపురం టౌన్: ఉగ్రదాడులకు నిరసనగా పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు శనివారం రాత్రి స్థానిక గడియారం స్తంభం సెంటరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెడరేషన్ (యూపీఎఫ్) అధ్యక్షుడు మొసలి స్పర్జన్‌రాజు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. సంఘాల ప్రతినిధులు నున్న ప్రభుకుమార్, ముంగండ లాల్, పట్టణ క్రైస్తవ యువజన సంఘం అధ్యక్షుడు నక్కా రాజ కిషోర్ పాల్గొన్నారు.



అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ వైద్యులు



తాళ్లరేవులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఎండీయూడబ్ల్యూఏ నాయకులు

సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పేరాయిచెరువు, దేవీనగర్ వాసులు

ఉప్పలగుప్తం: తమ గ్రామంలో తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ శివారు పేరాయిచెరువు, దేవీనగర్ ప్రాంతీయులు మండల, గ్రామస్థాయి అధికారులకు శనివారం వినతి పత్రాలను అందించారు. తమ ప్రాంతంలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ఉన్నప్పటికీ తాగునీటి సరఫరా లేదని, తమ ప్రాంతం ఉప్పునీటి ప్రాంతం కాంటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేక ఇబ్బంది పడుతున్నామని ఎంపీడీవో పి.రాజుకుమార్, పంచాయతీ కార్యదర్శి టి.రామకృష్ణ, విద్యుత్ ఏఈ శ్రీహరిలకు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కొల్లు వెంకటరమణ, జె.మురళీకృష్ణ, జె.అనిల్ కుమార్, పి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

అమలాపురం టౌన్: అమలాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకూ పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి జీవీఆర్‌ఎస్‌హెచ్ కృష్ణవర్మ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ తరగుతులు నిత్యం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ మూడు గంటల పాటు నేర్పనున్నట్లు వర్మ వివరించారు. కథలు చెప్పడం, చదవించడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. చదరంగ పోటీలు కూడా నిర్వహించి విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించి వారిలో పుస్తక పఠనం మీద ఆసక్తి పెంచి భవిష్యత్‌కు మంచి బాట వేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని వర్మ విజ్ఞప్తి చేశారు. 40 రోజుల పాటు సాగే తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బీవీసీలో సైన్సు, వైజ్ఞానిక ప్రదర్శన



స్కైహైట్స్ రెయిన్ అలారాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సైన్సు హ్యూమనిటీస్ మరియు ఐఐసీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. వాటర్ ప్యూరిఫికేషన్, హైడ్రో పవర్ ప్లాంట్, పొటాటో కెనాల్, ఎలక్ట్రిసిటీ జనరేటర్, లావా ల్యాండ్, స్కైహైట్స్ రెయిన్ అలారం తదితర ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆకుల ప్రవీణ్, అధ్యాపకులు దుర్గా మాధురి, తదితరులు పాల్గొన్నారు.

ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ప్రారంభం

అల్లవరం: బోడసకుర్రు హౌసింగ్ కాలనీలో రూ.57.19 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ఆనందరావు శనివారం ప్రారంభించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబురాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి నిరుపేద విద్యార్థుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓలు జి.సూర్యప్రకాశం, ఎస్ దుర్గాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించారని వచ్చే విద్యా సంవత్సరానికి ఉచిత విద్యను అందించే మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు ఇప్పటికే తమ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామ వార్డు సచివాలయాలు డేటా ఆధారంగా వచ్చే నెల 16 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థుల ప్రవేశాలకు అర్హతలు ఆధారంగా లాటరీ ద్వారా మొదటి విడత సీట్లు కేటాయిస్తామని తెలియజేశారు. జూన్ 6 తేదీన పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రవేశం నిర్ధారిస్తారన్నారు.

డాక్టర్ విజయరెడ్డికి ఉత్తమ పురస్కారం

అమలాపురం రూరల్: పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.విజయరెడ్డి సేవలకు ఉత్తమ పురస్కారం లభించింది. వరల్డ్ వెటర్నరీ డే సందర్భంగా ఉప సంచాలకుడు కర్నీడి మూర్తి చేతుల మీదుగా శనివారం రాత్రి ఆమెను ఉత్తమ పురస్కారంతో సత్కరించారు. అలాగే వన్నెచింతలపూడిలో పశువైద్య అధికారి పూర్ణిమ నాగలక్ష్మి, ఉత్తమ పశువైద్య అధికారి అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ అనిత, పశువైద్యులు మాధురి, నారాయణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.